కథ

# ది ట్రాప్

''ప్రేమకు పరాకాష్ట శారీరక సాంగత్యమే అని నా అభిప్రాయం'' ఆమెకి దగ్గరగా జరుగుతూ అన్నాడతను.

''కానేకాదు'' దూరంగా జరుగుతూ అందామె.

''మరేమిటట?'' మళ్లీ ఆమెకి దగ్గరగా జరుగుతూ అడిగాడు.

''ప్రేమకి పరాకాష్ట త్యాగం కాదు. శారీరక సాన్నిహిత్యం అంతకంటే కాదు. ఓ విధంగా పెళ్ళే అవుతుంది'' అతన్నుంచి కొంచెం ఎడంగా జరిగి చెప్పింది.

''మీ ఆడాళ్లంతా ఇంతే! పెళ్లే జీవిత పరమావధి అనుకుంటారు. అసలు పెళ్లి చేసుకోవడం తప్ప జీవితంలో సాధించాల్సినవి ఇంకేమీ లేదనుకుంటారు'' అతని స్వరంలో విసుగు ధ్వనించింది.

''పొరపాటు. పెళ్లి జీవితంలో ఓ భాగం మాత్రమే అని మా ఆడవాళ్ల అభిప్రాయం. అంతేకాదు, ప్రేమించినవాడితో జీవితాంతం గడపాలనుకోవడం మా ఆశ. కానీ దాన్ని మీ మగాళ్లు సరిగ్గా అర్థం చేసుకోలేరు. అందుకే ఎప్పుడూ మా ఆడజాతిని దుమ్మెత్తి పోస్తుంటారు'' కొంచెం కోపంగానే అందామె.

టాపిక్ సీరియస్ ట్రాక్‌లోకి వెడుతోందని గ్రహించాడతను. అంతేకాదు, ప్రస్తుతం తన పని సులభం అవ్వాలంటే ఆమెకి చక్కటి కబుర్లు చెప్పి ఆమెని మంచి మూడ్‌లోకి రప్పించాలన్న సూక్ష్మం తెలిసినవాడు కావడంతో అతనే గబుక్కున మామూలయ్యాడు.

''ఓకే! ఇక ఇలా ఈ విషయం గురించే మాట్లాడుకుంటూపోతే మనిద్దరి మధ్య పోట్లాట తలెత్తే ప్రమాదం వుంది. కాబట్టి టాపిక్ మార్చుతాను'' ఆమె కళ్లల్లోకి ఆరాధనగా చూస్తూ అన్నాడతను.

అతనలా సూటిగా చూడ్డంతో ఆమె కొంచెం సిగ్గుపడింది. మెల్లగా కళ్లు దించుకుని నేలచూపులు చూడసాగింది.

''స్పర్శ అనుబంధాన్ని పెంచుతుందంటారు. అంచేత నేన్నిన్ను స్పర్శించాలనుకుంటున్నాను'' మెత్తగా వున్న ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడతను.

''నువ్వన్నది తల్లీబిడ్డల విషయంలో ఓకే! భార్యాభర్తల విషయంలో కూడా ఓకే! కానీ మనలాంటి ప్రేమికుల విషయంలో...అదీ ఏకాంతంలో మాత్రం నో!'' మెల్లగా అతని చేతిలోంచి తన చేతిని విడిపించుకుంటూ మెత్తగా చెప్పింది.

''నువ్వు బొత్తిగా అజ్ఞానంలో ఉన్నావు సుమా!'' మళ్లీ అతని స్వరంలో విసుగు.

''అజ్ఞానం కాదు. అన్నిటికన్నా భయంకరమైన జ్ఞానం స్పర్శాజ్ఞానం అన్న విచక్షణా జ్ఞానంలో ఉన్నాను'' కొంచెం విసుగుగానే అందామె.

''నేను కేవలం నిన్ను తాకుతానన్నాను. ఇందులో తప్పేముంది?'' అతని స్వరంలో కోపం తొంగి చూసింది.

''స్పర్శించడంలో కూడా మళ్లీ మూడురకాలున్నాయి. ముట్టుకోవడం, ముద్దు పెట్టుకోవడం, కౌగలించుకోవడం...ఈ మూడింట్లో నీకు ఏ స్పర్శ ఇష్టం?'' చురుగ్గా అడిగింది.

''మూడూనూ'' రెండు క్షణాల మౌనం అనంతరం బాగా ఆలోచించి చెప్పాడు.

''అందుకే నన్ను ముట్టుకోవద్దన్నది'' ఠక్కున జవాబిచ్చింది.

అతను మాట్లాడలేదు. ముఖాన్ని అటు పక్కకి తిప్పుకుని ముభావంగా ఉండిపోయాడు. అది ఆలోచనో, లేక ఆగ్రహమో, అంతకుమించిన అవమానమో ఆమెకు అర్థం కాలేదు. ఆ మూడింటిలో ఏదయినాకానీ, అతన్లోంచి ఆ ఫీలింగ్‌ని తుడిచేయాల్సిన బాధ్యత తనదేనని ఆమెకి తెలుసు. అందుకే...మెల్లగా అతని భుజం మీద చెయ్యేసి నెమ్మదిగా నొక్కింది. ఆ స్పర్శకి చటుక్కున తల తిప్పి ఆమె ముఖంలోకి చూశాడతను.

''వయసులో వున్న ప్రతివాళ్లకీ కలిగే కోరికే ఇది. తమని ఆకర్షించినవాళ్లతో పరిచయం పెంచుకోవాలనిపిస్తుంది. పరిచయాన్ని ప్రేమగా మార్చుకోవాలనిపిస్తుంది. ముద్దు పెట్టుకున్న క్షణంలోనే హద్దులు దాటెయ్యాలన్నంత ఆవేశమూ వస్తుంది. అదుగో...సరిగ్గా అప్పుడే సెల్ఫ్ కంట్రోల్ లేకపోతే...ఆ తర్వాత ఎంతయినా జరిగిపోవచ్చు. అటుపై ఆ సంఘటనా, సందర్భమూ ఎక్కడికయినా దారి తియ్యచ్చు.

ఇన్ని అనర్థాలకి కారణమయిన ఆ కాస్త కోరికనీ పెళ్లికి ముందు కోరవద్దని నిన్ను అర్థిస్తున్నాను. నన్నర్థం చేసుకో...ప్లీజ్' నచ్చచెబుతున్నట్లుగా అంది.

ఆమె మాటలు అతనికి పూర్తిగా సమ్మతమయ్యాయో లేదోగానీ...అయినట్టు మాత్రం తల పంకించాడు. ఆ తర్వాత చిన్నగా నవ్వాడు. అతని చిర్నవ్వు ఆమె గుండెలో వెయ్యి వసంతాలు పూయించింది. హాయిగా నిట్టూర్చింది.

మరో అరగంట తర్వాత ఇద్దరూ చెరో దిక్కుకి విడిపోయారు.

గత కొద్దిరోజుల్నుంచీ...ఆ ఇద్దరి మధ్యా ఇంచుమించుగా ప్రతిరోజూ జరిగే తతంగమే ఇది.

ఎన్నో ఆశలతో...ఎన్నో కోరికలతో...ఎంతో ఆత్రుతతో...మరెంతో ఆరాటంతో ఆమెనుంచి ఆరోజు తను కోరుకున్నది ఖచ్చితంగా పొందగలడన్న నమ్మకంతో అతనొస్తాడు. రాగానే ఆ విషయమే ఆమెతో చెబుతాడు.

ఏవేవో మాటల్తో...ఎన్నెన్నో అనునయాల్తో...అంతకుమించిన అర్థింపులతో అతను కోరింది ఇవ్వకుండానే కాలం గడిపేస్తుందామె.

అదతనికి పరాజయంగా కొండొకచో పరాభవంగా కూడా అనిపిస్తుంటుంది. అతనికో చేదు అనుభవం. ఆమెకి మాత్రం అది...తల్చుకున్నప్పుడల్లా పులకరింతలుగానూ, పలవరింతలుగానూ అనిపిస్తుంటుంది. ఓ విధంగా ఆమెకో తీపి గుర్తు. రోజూ వాళ్లకి అది మామూలే.

అలాగే ఆ రోజూ జరిగింది.

అయితే జరిగినదాన్ని ఆమె తేలిగ్గానే తీసుకుంది. కానీ అతను మాత్రం మర్చిపోలేకపోయాడు. ఎలా అయినా తన కోరిక తీర్చుకోవాలన్న పట్టుదల కలిగింది. పంతం పుట్టుకొచ్చింది. అందుకోసం ఏం చెయ్యాలి? అన్న ఆలోచన రగుల్కొంది. ఆ రాత్రంతా నిద్రమాని విచారిస్తే తెల్లారేసరికి దానికో రూపం వచ్చింది. ఇక తిరుగులేదన్న నమ్మకం కలిగిన తర్వాత ఆమెకోసం బయల్దేరాడు.

★★★

''ఏమిటింత ఆలస్యం?'' అనుకున్న సమయానికి అరగంట ఆలస్యంగా చేరిన అతనికి ఎదురొస్తూ ఆతృతగా అడిగింది.

అతను మాట్లాడలేదు. ఆమెకి కంగారొచ్చింది.

''అడుగుతుంటే చెప్పవేం?'' రెట్టించింది.

''ఇంట్లో చిన్న ప్రాబ్లం'' మొదటి అస్త్రం విసిరాడతను.

''ఏమిటి?'' ఆమెలో ఆందోళన.

వెంటనే చెప్పలేదతను. ఆమెలో కంగారు మరింత పెరిగింది.

''త్వరగా చెప్పు! ఏవిటి?'' అతని భుజాల్ని పట్టుకుని కుదిపేసింది.

''మావాళ్లు నాకో సంబంధం చూశారు'' రెండో అస్త్రం వేశాడు.

ఆమె గుండె గుభిల్లుమంది. ''పెళ్ళి సంబంధమే?'' కళ్లు విప్పార్చుకుని గుండెలమీద చేతులేసుకుంటూ అంది.

''మరి నువ్వేమన్నావ్?'' అతని చేతుల్ని తన చేతిలోకి తీసుకుంటూ అడిగింది.

అతను మాట్లాడలేదు.

క్లిష్ట పరిస్థితుల్లో ఎదుటి మనిషిలోని మౌనం ఇవతల వ్యక్తిలో భయాన్ని పెంచుతుంది. ప్రస్తుతం జరిగిందీ అదే!

''చెప్పు...నువ్వు...నువ్వేమన్నావ్?'' ఆమె స్వరంలో జీర! కళ్లల్లో నీటిపొర. ఈసారి కూడా మౌనమే అతనిచ్చే జవాబయింది.

''ప్లీజ్! నీ మౌనంతో నన్ను చంపకు. మాట్లాడు. నన్ను..నన్ను వదిలి ఎక్కడికీ పోనని చెప్పు. నువ్వు లేకపోతే నేను బతకలేను. నిన్ను విడిచి నేనుండలేను. నన్ను వదిలి వెళ్లద్దు'' అతని గుండెలమీద వాలిపోయి ఏడవసాగింది.



తను సంధించి వదిలిన అస్త్రాలు ఆమెని సరిగ్గానే పడగొట్టాయన్న విషయం అతనికి అర్థమైంది. ఎదమీద వాలిన ఆమెని మరింతగా తనలో పొదువుకున్నాడు. అతని పెదవుల మీద విజయ గర్వంతో కూడిన చిన్న చిర్నవ్వు మెరిసి మాయమైంది. అదే మంచి అదను అని అతనికి తెలుసు.

అందిన అవకాశాన్ని చేజార్చుకోకూడదని అతని మగబుద్ధి మరీ మరీ తొందర పెడుతుంటే మెల్లగా రియాక్టయ్యాడు. ఆమె భుజాలమీదున్న చేతుల్ని తీసేసి అరచేతుల్తో ముఖాన్ని పట్టి పైకెత్తాడు. ఆమె కన్నీటిని తుడిచాడు. ఆ తడి తడి కనుదోయిపై తన పెదవుల్ని అద్దాడు.

మునుపటిలా చటుక్కున అతన్ని తోసేసి దూరంగా జరగలేదామె. అతని ముఖంలోకే చూస్తోంది. ఆ కళ్లల్లో ''నేను నిన్ను తప్ప మరెవ్వర్నీ ప్రేమించలేను'' అని అతను తనతో ఆర్తిగా, ఆత్మీయంగా, ఆప్యాయంగా మళ్లీ మళ్లీ చెప్పాలన్నంత ఆశ!

అదతనికి అర్థమైంది. అయినా మాట్లాడలేదు. తన చేతుల్ని మెల్లగా ఆమె భుజాల మీంచి నడుము మీదకి పోనిచ్చాడు. అక్కణ్ణుంచీ ఇంకా...ఇంకా ఎక్కడెక్కడికో! దేనికీ ఆమె అభ్యంతరం చెప్పలేదు. చెప్పదుకూడా! తను ఆశించిన విషయం అతని నోట్లోంచి వచ్చేదాకా అతను ఏం చేసినా ఆమె కాదనదు. ఆ సంగతి అతనికి బాగా తెలుసు.

కనుకనే తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించాడు. క్షణాల్లో అతని కోరిక తీరింది. ఆవేశం చల్లారింది. తృప్తిగా నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పు తర్వాతయినా తను కోరింది అతని నోటివెంట రావచ్చన్న ఆశతో అతనివైపే చూస్తోందామె.

**అగస్త్యప్రగడ హేమంత**

''మెనీ మెనీ థాంక్స్!'' ముక్తసరిగా చెప్పాడు.

అటు తర్వాత అతను మాట్లాడేది తమ పెళ్లి గురించే అనుకుందామె. కానీ ఆమె ఆలోచనల్ని తలక్రిందులు చేశాడతను.

''ఆడది నిగ్రహశక్తికి ప్రతీక అని నువ్వెన్నోసార్లు నిరూపించావు. కానీ...నిగ్రహం గల ఆడదాన్ని నమ్మకంతోనూ, విచక్షణా జ్ఞానంగల ఆడదాన్ని మౌనంతోనూ లొంగదీసుకోవచ్చని ఇప్పుడు నేను నిరూపించాను. ఇన్నాళ్లకి నా కోరికని ఈ విధంగా తీర్చుకోగలిగాను'' చెప్తున్న అతని మాటల్లో, కళ్లల్లో విజయగర్వం కదలాడుతోంది.

ఆమె అయోమయంగా వింటోంది.

''నిజమైన ప్రేమకి పరాకాష్ట పెళ్లి. పరిచయానికి పరాకాష్ట శారీరక సంబంధం'' చెప్పడం ఆపి ఆమె కళ్లల్లోకి చూశాడు.

వింటున్న ఆమె ముఖంలో భయం తాలూకు నీలినీడలు కదుల్తున్నాయి.

''మనది పరిచయమేగానీ ప్రేమకాదు. అంచేత...మనిద్దరికీ మధ్యవున్న పరిచయం రెండు క్షణాల క్రితం తీరిపోయిన నా కోరికతో ముగిసిపోయింది. ఇకనుంచీ నీకూ నాకూ ఎటువంటి సంబంధం ఉండదు. గుడ్‌బై'' చెప్పేసి వెళ్లిపోయాడతను.

ఆమె నిశ్చేష్టురాలయిపోయింది.

నిగ్రహానికి పరాకాష్ట నష్టపోవడమేనోనన్న భయంతో తన హద్దుల్ని దాటి... నమ్మకానికి పరాకాష్ట మోసపోవడమేనన్న నగ్నసత్యానికి ప్రతీకగా, శిలాప్రతిమలా...ఉన్న చోటనే నిలబడిపోయింది.

ఆమె...మోసపోయింది!

★